


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

శుక్రవారం 14, జులై 2023 | తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ


## కాంగ్రెస్ దిష్టి బొమ్మకు
# ఉరివేసి, దహనం చేసి
### ఎమ్మెల్యే సండ్ర ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వినూత్న నిరసన

వనం నాగయ్య, కెరటం న్యూస్

రైతులకు 3 గంటల కరెంటు చాలు అని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గంగారం(రామగోవిందపురం) గ్రామంలో విధ్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు మరియు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మకు ఉరి వేసి, దగ్ధం చేసి భారీ నిరసన తెలిపారు. పంటలే లేని సమయంలో విద్యుత్ ఇవ్వడం లేదంటూ రికార్డులు పరిశీలిస్తున్న నాయకుల అవగాహన రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుంది. రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని, అమెరిక వేదికగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిగతా 2లో..







## ఈ నెల 15 నుంచి బీసీ కుల వృత్తులకు
# ఆర్థిక సాయం..

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్..

జులై13 ఖమ్మం-కెరటం న్యూస్:

ఈ నెల 15 నుంచి బీసీ కుల వృత్తులకు ఆర్థిక సహాయం కింద లక్ష రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి బీసీ కుల వృత్తులు, చేతి వృత్తులకు ఆర్థిక సహాయం పథకం అమలుపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ కులవృత్తులు, చేతి వృత్తులను సంరక్షించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి మిగతా 2లో..

## డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులు
# వేగవంతం చేయాలి

- త్వరగా లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ వీపీ.గౌతమ్

2లో



# ఖమ్మంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీజ్

- ఉద్రిక్తంగా మారిన విద్యార్థి, ప్రజా సంఘాల ఆందోళన

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

నిబంధనలు పాటించకుండా ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా ఖమ్మం జిల్లా ప్రజలను మోసం చేస్తూన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పైన చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు తుడుం ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శులు ఇటికల రామకృష్ణ, మస్తాన్ వెంకటేష్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట వామపక్ష విద్యార్థి, యువజన, మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రద్దు చేయాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల కొనసాగిస్తూ మిగతా 2లో..



## కాంగ్రెస్ దిష్టి బొమ్మకు
# ఉరివేసి, దహనం చేసి

(మొదటిపేజీ తరువాయి..)

రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగ వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అని చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం (రామగోవిందపురం) విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మకు ఉరి వేసి, దహనం చేసి నిరసన తెలిపారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అన్న కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేఖ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తె ధరణి తీసేస్తాం అన్నారు. ఇప్పుడు ఉచిత విద్యుత్ తీసేస్తామని అంటున్నారు.దేశానికి తిండి గింజలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు అధికారం మీద ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే సబ్ స్టేషన్ లకు వెళ్లి రికార్డ్ లు చూసి ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదని కొంతమంది నాయకులు ప్రచారం చేస్తున్నవారి అవగాహన రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పంటలే లేని సమయంలో విద్యుత్ ఇవ్వడం లేదు అంటూ మాట్లాడటం వాళ్ళ అవగాహన లోపాన్ని ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న ఏ రాష్ట్రం లో కూడా తెలంగాణ రాష్ట్రం ఇస్తున్న పథకాలు లేవని తెలిపారు.

## డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులు
# వేగవంతం చేయాలి

జులై13 ఖమ్మం-కెరటం న్యూస్: డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేసి, త్వరితగతిన లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్ మునిసిపల్ కార్పోరేషన్ పరిధిలోని అల్లిపురం, వైఎస్సార్ నగర్‌లో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. అల్లిపురంలో 8 బ్లాకుల్లో 192 గృహాలను జి ప్లస్ 2 పద్ధతిలో నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. 168 గృహాల పను లు ప్రారంభించగా, ప్లాస్టింగ్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. బ్లాకుల వారిగా పనులు పూర్తిచేసి, పూర్తి అయిన బ్లాకులను వెంట వెంటనే అందజేయాలన్నారు. వైఎస్ఆర్ నగర్ లో 4 బ్లాకుల్లో జి ప్లస్ 2 పద్ధతిలో 96 గృహాలు నిర్మాణంలో ఉన్న ట్లు తెలిపారు. ఇట్టి గృహాల్లో ప్లాస్టింగ్ మిగులు పనులు చేప ట్టాల్సి ఉందన్నారు. పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు త్వరగా పూర్తయితే బిల్లులు వెంటనే వస్తాయని ఆయన తెలిపారు. వర్కర్లను పెంచాలని, అన్ని బ్లాకుల్లో పనులు చేపట్టాలని ఆయన అన్నారు. పను ల్లో రోజువారి పురోగతి ఉండాలని, అధికారులు రోజూ పనులు జరిగేట్లు పర్యవేక్షణ చేయాలన్నారు. అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు. అనంతరం వై.ఎస్.ఆర్ నగర్ బస్తీ ధవాఖానలో వైద్య సేవలను కలెక్టర్ ఆకస్మిక తణిఖీ చేశారు. అందించే వైద్య సేవలు, ఔషదాల నిల్వ వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిజనల్ వ్యాధుల ప్రభలుతున్నందున వైద్య అధికారులు ప్రత్యేక శ్రద్ధకనబర్చి వచ్చే రోగులకు నిరంతరాయంగా వైద్య సేవలందించాలన్నారు. వై.ఎస్.ఆర్ నగర్‌లో ప్రభుత్వ భూ ముల్లో నివాసాలు ఏర్పరచుకున్న వారికి ప్రభుత్వ ఉత్వర్వు నెం. 58, 59పై అవగాహన కల్పించారు. డిమాండ్ చెల్లింపు త్వరితగతిన పూర్తిచేసి పట్టాలు పొందాలని తెలిపారు. పట్టాలు పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను నివాసులకు తెలియజేశారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారిని శిరీష, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ ప్రసాద్, సర్వేల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైద్యాధికారులు మౌర్య ఉన్నారు.

## పంచాయతీ కార్మికుల పోరాటంలో
# భాగస్వాములమవుతాం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, జిల్లా కార్యదర్శి నున్నా

తల్లాడ, కెరటం న్యూస్: తల్లాడలో గత ఎనిమిది రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని గురువారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలియజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పోరాటంలో భాగ్యస్వాముల మవుతామన్నారు, కార్మిక బంధు ప్రకటించాలన్నారు, జీఎస్టీ పేరుతో గొప్పలు చెప్పుకుంటూ కార్మికుల కష్టాన్ని గుర్తించ



కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వా న్ని విమ ర్శించారు, కార్మికుల కష్టానికి తగిన ఫలితం అందడం లేదన్నా రు, వంట వార్పు కార్యక్రమానికి సిపిఎం పార్టీ తరఫు న 5000 రూపాయల ఆవేదన పోతినేని సుదర్శన్ రావు కార్మికులకు అందజేశారు, గోపాల్పేట సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు 2000 రూపాయల అందజేశారు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సిఐటి నాయకులు షేక్ మస్తాన్, డివైఎఫ్ఐ నాయకులు సత్తెనపల్లి నరేష్, ఎఫ్2 నాయ కులు డి శ్రీనివాసరావు, వేలాద్రి బాబురావు పాల్గొన్నారు.

## ఈ నెల 15 నుంచి బీసీ కుల వృత్తులకు
# ఆర్థిక సాయం..

(మొదటిపేజీ తరువాయి..)

వర్యులు తెలంగాణ రాష్ట్రంలో అనేక చర్యలు తీసుకున్నారని మంత్రి తెలిపారు. కుల వృత్తులు చేతివృత్తులు చేసుకునే వారికి ప్రోత్సాహం అందిస్తే ఆర్థికంగా ఎదుగుతారనే ఉద్దేశంతో లక్ష రూపాయలు గ్రాంట్ అందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారని, ఈ పథకాన్ని జూన్ 9వ తారీఖున ముఖ్యమంత్రివర్యులు లాంచనంగా ప్రారంభించారని మంత్రి పేర్కొన్నారు. జూన్ 20 వరకు బీసీ కుల వృత్తులకు ఆర్థిక సహాయం కోసం 5 లక్షల 28 వేల దరఖాస్తులు స్వీకరించామని, వీటి నుంచి అర్హులైన ప్రతి లబ్దిదారుడికి సహాయం అందే వరకు ఈ పథకం కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. జూల్కై మాసంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 300 మందికి జూల్కై 15 నుంచి లక్ష రూపాయలు చెక్కుల పంపిణీ చేయాలని మంత్రి సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 50 మంది లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తుంది, కొన్ని వర్గాల వారికి మాత్రం వస్తుందని అసంపూర్తి వార్తలు ప్రచారంలో ఉన్నాయని, ఇవి ఏ మాత్రం వాస్తవం కాదని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తెలిపారు. బీసి కులవృత్తుల ఆర్థిక సహాయం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందని, చివరి లబ్దిదారుడికి సహాయం అందే వరకు ప్రతి నెలా చెక్కుల పంపిణీ ఉంటుందని మంత్రి తెలిపారు. బీసి కులవృత్తుల, చేతి వృత్తుల కింద దరఖాస్తు చేసుకున్న వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికి దశల వారీగా పథకం అమలవుతుందని, ప్రతి నెల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు. జుల్కై 15 నుంచి బీసీ కుల వృత్తులకు, చేతి వృత్తుల చెక్కుల పంపిణీ కార్యక్రమం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే సమక్షంలో ప్రారంభించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సహాయం అందుకున్న లబ్దిదారుల వారికి నచ్చిన చోట అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి కులవృత్తి చేసుకోవచ్చని, నెల రోజుల లోపు అధికారులు సదరు లబ్దిదారుని యూనిట్ వివరాలు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని మంత్రి తెలిపారు.

బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ, బీసీ కుల వృత్తుల ఆర్థిక సహాయం పథకం కింద దరఖాస్తు చేసుకున్న 5.28 లక్షల అభ్యర్థులలో 15 కుల వృత్తుల, చేతి వృత్తుల వారికి మొదటి ప్రాధాన్యం అందించాలని, ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను జిల్లా ఇంఛార్జి మంత్రిచే ఆమోదింప చేసుకొని జుల్కై 15 నుంచి చెక్కుల పంపిణీప్రారంభిం చాలని అన్నారు. ప్రతి నెల చెక్కుల పంపిణీ ఉంటుందని, జుల్కై మాసంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 300 మంది లబ్ధిదారులకు పథకం అమలవుతుందని తెలిపారు. బీసి కులవృత్తుల ఆర్థిక సహాయం కోసం వచ్చిన ఏ దరఖాస్తును తిరస్కరించడం లేదని, దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారందరికి దశల వారీగా పథకం వర్తింపజేయాలని ప్రభుత్వంనిర్ణయించిందని ఆయన తెలిపారు. బీసీ కుల వృత్తుల ఆర్థిక సహాయం పథకం కింద జిల్లాలో జూన్%--%20 నాటికి 26,451 దరఖాస్తులు అందాయని, ప్రభుత్వ మార్గదర్శకాల కనుగుణంగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగలి , శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జ్యోతి , సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీజ్



(మొదటిపేజీ తరువాయి..)

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యంపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటూ విద్యార్థులకు నాణ్యమైనటువంటి విద్య అందించకుండా విద్యార్థులను మోసం చేస్తున్నారని వారు దుయ్యబట్టారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండానే గుర్తింపు ఉన్నట్లు ప్రజలను, అధికారులను మోసం చేయడమే కాకుండా మభ్యపెడుతూ గత మూడు సంవత్సరాల నుండి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నడుపుతున్నా అధికారులు చోద్యం చూడటం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస సౌకర్యాలు లేకుండా ప్లే గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ, ఫీజుల బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా కమర్షియల్ బిల్డింగ్ లో విద్యా సంస్థను ఎలా నడుపుతారని వారు ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలకు పూనుకోవాలన్నారు. జిల్లాలో అనేక పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవడం లేదని అలాంటి విద్యాసంస్థల అన్నిటి పైన ప్రభుత్వం చర్యలకు పూనుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష మహిళ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు సిహెచ్ శిరోమణి, ఝాన్సీ, మంగతాయి, తేలే రాకేష్ నాన్న బాల రామకృష్ణ బషిరుద్దీన్ చందు ప్రేమ్ సింగ్, రమేష్, నాగరాజు, దీపిక, లక్ష్మణ్, వినయ్, కార్తీక్, యువరాజ్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

**ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను సీజ్ చేసిన విద్యాధికారులు:** సంఘటన స్థలానికి జిల్లా విద్యాశాఖ అధికారి సోమేశ్వర్ శర్మ, ఖమ్మం మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు చేరుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పైన చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ను సీజ్ చేస్తున్నామని మా అనుమతి లేకుండా ఈ పాఠశాల ఎవరు తెరవడం కుదరదు, అని విద్యాశాఖ అధికారులు ప్రకటించినట్టు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి.

# ఇదేనా రైతులపై మీకున్న ప్రేమ?



- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం..
- మూడు గంటల విద్యుత్ అంటే మళ్లీ రైతులకు నరకమే..
- సీఎం కేసీఆర్ రైతులకు అమలుచేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శం..
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ దోరెపల్లి శ్వేత..

ఖమ్మం టౌన్, జూలై13, కెరటం న్యూస్

ఉచిత విద్యుత్తుపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్ధ రహితమనీ, మూడు గంటల ఉచిత విద్యుత్ అంటే గతంలో రైతులు అనుభవించిన నరకప్రాయమే మళ్లీ ఎదురవుతుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దోరెపల్లి శ్వేత విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోసం రైతులు ఎంత గోస పడ్డరో కండ్లారా చూశామని అన్నారు. విద్యుత్తు ఉద్యమంలో బషీర్‌బాగ్ లో జరిపిన కాల్పుల ఘటన ఇంకా కండ్ల ముందు మెదులుతూనే ఉన్నదని దోరెపల్లి శ్వేత గుర్తు చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నేత రేవంత్ రెడ్డి విద్యుత్ పై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం అతని విజ్ఞతకే వదిలేయాలన్నారు. రైతులను చులకనగా మాట్లాడిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఏఎంసీ చైర్ పర్సన్ శ్వేత గురువారం ఒక ప్రకటనలో ఖండించారు.

సీఎం కేసీఆర్ రైతులకు అమలు చేస్తున్న రైతు బీమా, రైతు బంధు లాంటి అనేక బృహత్తర పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. గడిచిన తొమ్మిదేళ్ళలోనే వ్యవసాయ, మార్కెటింగ్ రంగంలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి రైతులపట్ల, వ్యవసాయం పట్ల కనీస అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకర మన్నారు. అందుకే 24 గంటల ఉచిత విద్యుత్తుపై అర్ధ రహిత మైన మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. విద్యుత్తుపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎంత మాత్రం కరెక్ట్ కాదని స్పష్టంచేశారు. ఇదే జరిగితే రైతులను మళ్లీ నరకకూపంలోకి నెట్టడమేనని అన్నారు. ఉమ్మడి ఏపీలో నాడు కాంగ్రెస్ ముఖ్యమంత్రే వ్యవసాయానికి ఏడు గంటల కరెంట్ ఇస్తామని ప్రకటిస్తే.. రేవంత్‌రెడ్డి మూడు గంటలే చాలు అనడం అశ్చర్యంగా ఉన్నదని విమర్శించారు. అప్పుడు పగలు మూడు గంటలు, రాత్రి నాలుగు గంటల కరెంట్ ఇచ్చేవాళ్లు. రాత్రి కరెంట్‌తో ఏటా సుమారు 600 మంది రైతులు కరెంట్ షాక్‌తో చనిపోయేవారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి మళ్లీ రావాలని ఎవరూ కోరుకోరని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఈ పరిస్థితులను కోరుకుంటున్నట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వడం వల్ల రైతులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఒకవేళ రేవంత్‌రెడ్డి చెప్తున్న మూడు గంటల కరెంటే నిజమైతే రాష్ట్రంలో రైతులను మళ్లీ నరక కూపంలోకి నెట్టేసినట్టే అవుతుందన్నారు. రాష్ట్రంలో 60 శాతం సాగు భూమి బోర్లు, బావుల కిందనే ఉన్నది. 24 గంటల కరెంట్ లేకపోతే ఈ భూములన్నీ మళ్లీ పడావుగా మారడం ఖాయమన్నారు.

## సీఎం కుర్చీ నాలుగు కాళ్లలో ఒకరు

# మోతె శోభన్ రెడ్డి

- ఎన్నో అవకాశాలను తృణప్రాయంగా వదిలేసుకున్న త్యాగశీలి
- ఇప్పటికైనా ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాల్సిందే..
- ముక్తకంఠంతో నినదించిన టిటియూసి నేతలు, కార్మికులు
- ఒక్క అవకాశం ఇస్తే లక్ష మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా
- టికెట్ ప్రకటించేదాకా మా పోరాటం కొనసాగిస్తామని వెల్లడి



హైదరాబాద్, జూలై 13 (కెరటం న్యూస్)

దాదాపు రెండున్నర దశాబ్దాలుగా గుప్పెడు మంది గులాబీ పార్టీలో ఒకరిగా ఉంటూ.. కేసీఆర్ కు నాటి నుంచి నేటిదాకా వెన్నంటి నిలుస్తున్న టిటియూసి వ్యవస్థాపక అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కచ్చితంగా కేటాయించాలని కార్మిక నేతలు, కార్మికులు డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీకి గుండెకాయలాగా యూనియన్ ను నడిపించి ప్రజలు, కార్మికుల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్న ఉద్యమ నాయకుడు శోభన్ రెడ్డి అని గుర్తు చేశారు. ఎన్నిసార్లు అవకాశాలు వచ్చినా వాటిని పార్టీ బలోపేతం కోసం, కేసీఆర్ ఆదేశాల మేరకు తృణప్రాయంగా వదిలేసుకున్నారని చెప్పారు. టిటియూసి రాష్ట్ర కమిటీ, అనుబంధ యూనియన్ల ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో శోభన్ రెడ్డి నేపథ్యాన్ని పలువురు కార్మిక నేతలు వివరించారు. ఈ సందర్భంగా మలిదశ ఉద్యమంలో శోభన్ రెడ్డి సోదరుడు అమరుడైన మోతె రాంరెడ్డికి మౌనం పాటించి, నివాళులర్పించారు.

టిటియుసి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి నాను నాయక్ మాట్లాడుతూ.. తార్నాకలో తొలి జెండా ఎగురవేసి వేలాది మందితో ఆనాడే సభను నిర్వహించిన సమర్ధుడు శోభన్ రెడ్డి అని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసమే పనిచేశారు తప్ప పదవులను ఎప్పుడూ ఆశించలేదని అన్నారు. నోరు తెరిచి అడుగుతున్నాం.. ఇప్పటికైనా ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని, లేదంటే ఇచ్చేదాకా ఇలాంటి సభలు సమావేశాలు నిర్వహిస్తూనే ఉంటామని అన్నారు.

టిటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఓ ఇంటికి పిల్లర్ లాగా పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారుడు శోభన్ రెడ్డి అని అన్నారు. 2006లో యూనియన్ స్థాపించి ఒంటి చేత్తో దానిని నడిపిస్తూ కార్మిక బాంధవుడిగా నిలిచారన్నారు. ఆయన వంటి నేతలకు పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఇది ఆవేదనతో చెబుతున్నానని అన్నారు. ఎమ్మెల్యేగా నిలబడేందుకు శోభన్ రెడ్డికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. యూనియన్ కు ఐదు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చినా తక్కువేనని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

సీనియర్ కార్మిక నేత, టిటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జూపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీకి, కేసీఆర్ నడిపించిన ఉద్యమానికి ట్రేడ్ యూనియన్ కీలకంగా నిలిచిందని తెలిపారు. అందువల్ల రెండు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని, జిల్లాలో నామినేటెడ్ పోస్ట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ సీనియర్ నేత శివానంద్ మాట్లాడుతూ.. కార్మికుల కోసం తన జీవితమంత పోరాడిన శోభన్ రెడ్డి ఏనాడూ పదవులను ఆశించలేదని, ఎమ్మెల్యేగా అవకాశం వచ్చినా పార్టీ ఆదేశం మేరకు బిఫామ్ ను తిరిగి ఇచ్చేసిన ఉదార స్వభావి అని వివరించారు. ఆయన పార్టీలోకి తీసుకొచ్చినవారు సైతం ఎమ్మెల్యే, మంత్రి అయ్యారని, శోభన్ రెడ్డి మాత్రం నేటికీ కార్మిక నేతగానే ఉన్నారని చెప్పారు. కార్మికుల పక్షాన గళం వినిపించే నాయకుడిగా ఆయనను అసెంబ్లీకి పంపాల్సిన అవసరం ఉందన్నారు.

ట్రేడ్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. 23 ఏళు ,గా పార్టీ కోసం కష్టపడుతూ తనలాంటి ఎంతోమంది యువకులను గులాబీ గూటికి తీసుకొచ్చారని అన్నారు. ఆయన సేవలను గుర్తించి సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని, భారీ గెలిపించుకుంటామని చెప్పారు. శోభన్ రెడ్డి వంటి నాయకులు అరుదుగా ఉంటారని, అర్ధరాత్రి ఆపద ఉందని ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని యూనియన్ నల్గొండ అధ్యక్షులు అశోక్ రెడ్డి, ఇతర కార్మిక నాయకులు తెలిపారు. ఆర్థికంగా ఆదుకోలేని తాము.. ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే శోభన్ రెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపిస్తామని ఈ సందర్భంగా కార్మిక నేతలు, కార్మికులు ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ నాయకులు కుమార్ మాట్లాడుతూ.. ఎంతోమందికి పదవులు వచ్చినా శోభన్ రెడ్డి మాత్రం ఓపికతో పని చేసుకుంటూ వెళ్లారని వివరించారు. ఆయన సతీమణి, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి ఇద్దరు చిన్న పిల్లలను పోషించుకుంటూ తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారని, భర్తకు అన్నివిధాలుగా సహకారాలు అందిస్తూ ఉద్యమ స్ఫూర్తిని నింపారని కొనియాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడినుంచి అవకాశం కల్పించినా.. శోభన్ రెడ్డిని గెలిపించేందుకు యూనియన్ నాయకులు, కార్మికులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎస్ఎన్ రెడ్డి, సుదర్శన్, మేకల సోమిరెడ్డి, అడాల శివ కుమార్, ఆటో యూనియన్ నాయకులు శ్రీకాంత్ యాదవ్, టిటియుసి మహిళా నాయకులు మంజుల, విజయ డైరీ యూనియన్ నాయకులు, పలు జిల్లాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఈ నెల 15, 16న అనస్తీషియా

# రాష్ట్ర స్థాయి సదస్సు

- ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్ కుమార్
- విలేకరుల సమావేశంలో ఆర్గనైజింగ్ ఛైర్మన్ బాగం కిషన్ రావు



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

అనస్తీషియాలజిస్టు ఎనిమిదవ రాష్ట్ర స్థాయి సదస్సు ఈనెల 15, 16 తేదీలలో మమత మెడికల్ కళాశాలలోని డెంటల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ బాగం కిషన్ రావు తెలిపారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజిస్టు రాష్ట్ర శాఖ సహకారంతో ఐఎస్ఏ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో అనస్తీషియాలజిస్టు రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో 800 మంది వైద్య విద్యార్థులు పాల్గొంటారని దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసుకున్నారని తెలిపారు. 50మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయిలోని ప్రముఖ వైద్యులు ఈ సదస్సులో పాల్గొని వైద్య రంగంలో అనస్తీషియాలజిస్టు యొక్క ప్రాముఖ్యత గురించి, వైద్య రంగంలో వస్తున్న నూతన విధానాలపై ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి సదస్సులో భాగంగా 14వ తేదీన వర్క్షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనస్తీషియా విభాగంలో ఆధునీక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానంపై ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. ఐదు విభాగాలకు సంబంధించి వర్క్ షాపు ఉంటుందని తెలిపారు. 15వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు అతిథులుగా ఐఎస్ఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, ఐఎస్ఏ నేషనల్ సెక్రటరీ డాక్టర్ సుకిందర్ జిత్సింగ్, మమత సంస్థల ఫౌండర్ పువ్వాడ నాగేశ్వరరావు, సెక్రటరీ పువ్వాడ జయశ్రీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేసేందుకు కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్గనైజింగ్ ఛైర్మన్ గా బాగం కిషన్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి. సురేష్, ట్రెజరర్, కో సెక్రటరీగా కె. రవి, కో ఛైర్మన్ గా కిరణ్, డాక్టర్ విజయ, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబరు డాక్టర్ కోటేశ్వరరావు, ట్రాన్స్ పోర్టు కమిటీ మెంబర్లు విజయ, యశోద, అకామిడేషన్ కమిటీ మెంబర్లుగా జె. సురేష్, అనూష వ్యవహరిస్తారని తెలిపారు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు ఖమ్మంలో అనస్తీషియాలజిస్టు సదస్సు నిర్వహించామని మరల ఇప్పుడు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు కిషన్ రావు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.సురేష్, ట్రెజరర్, కో సెక్రటరీ కె. రవి, కో ఛైర్మన్ కిరణ్, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కోటేశ్వరరావు, విజయ పాల్గొన్నారు.

**మత్తు వైద్యులదే ప్రాముఖ్యత:** వైద్య రంగంలో మత్తు వైద్యుల ప్రాముఖ్యత పెరిగిందని డాక్టర్ బాగం కిషన్ రావు తెలిపారు. ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్, శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో మత్తు వైద్యులు కీలక పాత్ర వహిస్తారని తెలిపారు. రోగి యొక్క పరిస్థితిని బట్టి వారికి ఎంత వరకు మెడిసిన్ అందించాలనేది మత్తు వైద్యులకు తెలుస్తుందని తెలిపారు. జనరల్ ఫిజిషియన్ వైద్యుల వలే మత్తు వైద్యులు కూడా వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. మానవ శరీరానికి సంబంధించి పూర్తి పరిజ్ఞానం మత్తు వైద్యులు కలిగి ఉంటారని ఆయన తెలిపారు.



## ఇల్లందు నియోజకవర్గంలో మాజీ ఎంపీ

# పొంగులేటి పర్యటన



ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇల్లందు నియోజకవర్గంలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించి దీవెనలు అందజేశారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆర్థికసాయాలను కూడా అందించారు. ఆపదలో అండగా ఉంటాననే భరోసా కల్పించారు. అదేవిధంగా, బయ్యారం గ్రామాల్లో గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పక్షాన తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి ప్రధాన డిమాండ్ల అన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పొంగులేటి డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతా కల్పించాలని, ప్రస్తుతం వారు తీసుకుంటున్న సుమారు రూ. 9వేల వేతనాన్ని రెట్టింపు చేయాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ఛైర్మన్ కోరం కనకయ్య, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

## ద న్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో

# ముమ్మరంగా సభ్యత్వాలు

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

నగరంలోని టీఎన్జీవో ఫంక్షన్ హల్ లో గురువారం ద న్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్,ఆర్.వి.ఎస్.సాగర్ అధ్యక్షతన జరిగిన ఎస్సి,ఎస్టీ,బిసి హాస్టల్ వెల్ఫేయిర్... సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్,ఐటీఐ ఫోరమ్,ఆయుష్ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అఫ్జల్ హసన్ మాట్లాడుతూ ఎస్సి,ఎస్టీ,బిసి హాస్టల్ వెల్ఫేయిర్ ఆఫీసర్లు 73 మంది,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ నుంచి 28 మంది,ఐటీఐ ఫోరమ్ నుంచి 14 మంది,ఆయుష్ ఫోరమ్ నుంచి కొందరు సభ్యత్వాలు పొందినట్లు తెలిపారు. టీఎన్జీవో యూనియన్ ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చేవరకు అండగా ఉంటోందన్నారు. ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఇండ్లస్థలాల సాధన సాధ్యమైదన్నారు. ఉద్యోగుల పక్షాన నిలబడి,సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.ఉద్యోగులు అదే నమ్మకంతో ఇంత పెద్ద ఎత్తున సభ్యత్వాలు పొందడం హర్షణీయం అన్నారు. పాత సొసైటీ అధ్యక్షులు ఉద్యోగులను ఇంకా మభ్యపెడుతూ అభూతకల్పనలు కల్పిస్తూ తన అనుచరుల ద్వారా వాట్సాప్ మెసేజ్ లు పెడుతూ ఉద్యోగులను వంచన చేస్తున్నారని ఆరోపించారు.సొసైటీ స్థలం పేరుతో ఆర్థికంగా నిలదొక్కుని ఉద్యోగులపై ా ఎ తీ ్త న ం చేలాయించడాన్ని మీరు అర్థం చేసుకోవాలని సూచించారు. అన్ని కేసులకు ఆయా కోర్టుల నుంచి స్టే తీసుకుంటూ పబ్బం గడుపుతున్నారని ,సొసైటీ లో గ్రీన్ బెల్ట్ స్థలాలను కూడా అక్రమ రియల్ దందా చేసే వ్యక్తులతో కలిసి అమ్ముకుంటున్నారని విమర్శించారు.

పాత అధ్యక్షుడికి 3లక్షలు చెల్లించిన సభ్యులు అధైర్య పడవద్దని వారికీ కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చినారు .తాను టీఎన్జీవో అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏఒక్క ఉద్యోగి వద్ద నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టించలేదన్నారు.ప్రతి ఉద్యోగి సంక్షేమం కోసం టీఎన్జీవో బాధ్యతాయుతంగా పనిచేస్తోందని అన్నారు.ఏది మంచో,ఏది చెడో అర్థం చేసుకోవాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను,రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.ప్రసాద్ రావు,హౌసింగ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్ నీరు కొండ చంద్రశేఖర్ ,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చుంచు వీరనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. మజీద్,కిరణ్ ,పుల్లయ్య ,కోశాధికారి భాగం పవన్ ,టౌన్ అధ్యక్షులు నాగుల్ మీరా,సెక్రెటరీ కట్టా నవీన్ ,హాస్టల్ ఫోరమ్ ,సర్వే %౭%ల్యాండ్ రికార్డ్స్ ఫోరమ్ ,ఐటి ఐ ఫోరమ్ ,ఆయుష్ ఫోరమ్ అధ్యక్ష కార్యదర్శులు రుక్మరావు ,నాగేశ్వరారవు ,లక్ష్మణ్ ,మురళి ,వై .వెంకటేశ్వర్లు ,శ్రీనివాసరావులు ,రూరల్ యూనిట్ అధ్యక్షులు వెంకటరెడ్డి ,నేలకొండపల్లి యూనిట్ అధ్యక్షులు లవన్ ,కల్లూరు యూనిట్ కార్యదర్శి సవర్జన్ పాల్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శాబాసు జ్యోతి,ఇ.స్వప్న,వైరా యూనిట్ అధ్యక్షురాలు స్వప్న, వై.శ్రీనివాసరావు, పురుషోత్త%శీ%రెడ్డి,హాస్పిటల్ ఫోరమ్ ఫిరంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## ఎంపీ నామ నిర్దేశకత్వంలో న్యూఢిల్లీకి

# భద్రాద్రి జిల్లా ప్రజా ప్రతినిధులు

## నామ ఆధ్వర్యంలో సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతులు

**ఖమ్మం బ్యూరో, జూలై 13-కెరటం న్యూస్:** బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వర రావు నేతృత్వం..నిర్దేశకత్వంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు విడతల వారీగ న్యూఢిల్లీకి విజ్ఞాన యాత్ర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇటీవల ఖమ్మం జిల్లాకు చెందిన జెట్పీటీసీలు, ఎంపీపీ లు, పార్టీ మండల అధ్యక్షులు న్యూఢిల్లీ విజ్ఞాన యాత్ర ముగించుకుని వచ్చిన సంగతి విదితమే. అయితే తాజాగా మలి విడతలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన జెట్పీటీసీలు, ఎంపీపీ లు, మండల పార్టీ అధ్యక్షులు న్యూఢిల్లీకి ఏపీ ఎక్స్ప్రెస్‌లో ఖమ్మం నుంచి గురువారం బయలుదేరి వెళ్లారు. వీరంతా అక్షరధామం, రెడ్ పోర్ట్, తాజ్ మహల్, పార్లమెంట్, తదితర తదితర చారిత్రక ప్రదేశాలను సందర్శించి, విజ్ఞానాన్ని సముపార్జిస్తారు. అంతేకాకుండా నామ నాగేశ్వరరావు నేతృత్వంలో సమస్యలపై కేంద్ర మంత్రులను కూడా కలుస్తారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు చారిత్రక అంశాలను అక్కడి వారిని అడిగి తెలుసుకొని. విజ్ఞాన విషయాలను మననం చేసుకుంటారు.ఆగ్రా వెళ్లి అబ్బురపర్చే తాజ్ మహల్ కట్టడ సౌందర్యాన్ని కూడా తిలకిస్తారు.ఈ నెల 17వ తేదీ వరకు ఈ విజ్ఞాన యాత్ర కొనసాగుతుందని ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయం తెలిపింది.

**నామకు ధన్యవాదాలు:** ఎంపీ నామ నాగేశ్వరరావు ఎంతో ముందు చూపుతో విజ్ఞాన సముపార్జన కోసం, విజ్ఞాన యాత్ర ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీ నామ నాగేశ్వరరావుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా ప్రతినిధులు ప్రత్యేకించి ధన్యవాదాలు తెలిపారు. నామ గారి ద్వారా వివిధ సమస్యలపై కేంద్ర మంత్రులను కలసి వినతి పత్రాలు అందించడం జరుగుతుందని ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఎంపీ నామ చలువ వల్లనే తాము న్యూఢిల్లీ వెళ్లి ఎన్నో తెలియని చారిత్రక కట్టడాలను సందర్శించే అదృష్టం కలిగిందని చెప్పారు. పుస్తకాల్లో చదివిన చారిత్రక కట్టడాలను స్వయంగా చూసి, ఎంతో అనుభూతిని పొందడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.సొంత ఖర్చుతో తమకు విజ్ఞాన యాత్ర ఏర్పాటు చేసిన ఎంపీ నామ నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు.. ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని పేర్కొన్నారు.



**నామ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులకు వినతులు:** ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు ఎంపీ నామ నాగేశ్వరరావు నేతృత్వంలో రోడ్లు, రైల్వే, పామాయిల్ రైతుల సమస్యలతో పాటు భద్రాచలం – కొవ్వూరు రైల్వే లైన్, జిల్లాలో కేంద్రీయ, నవోదయ విద్యాలయాల ఏర్పాటు, తదితర సమస్యలపై పలువురు కేంద్ర మంత్రులను, సంబంధిత ఉన్నతాధికారులను కలసి లేఖలు అందజేస్తారు.

ఈ విడత విజ్ఞాన యాత్రలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు (పాల్వంచ), సొసైటీ అధ్యక్షులు మండే వీర హన్మంతరావు, అన్నపురెడ్డిపల్లి అశ్వారావుపేట, దమ్మపేట, పాల్వంచ , చంద్రుగొండ, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్ రావు, బండి పుల్లారావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, పూసల విశ్వనాథం,మల్లెల శ్రీరామ్మూర్తి, మంతపురి రాజుగౌడ్, దారా వెంకటేశ్వరరావు, కొట్టి వెంకటేశ్వరరావు, మోరంపూడి అప్పారావు, జెట్పీటీసీలు పైడి వెంకటేశ్వరరావు( దమ్మపేట ) , బరపాటి వాసుదేవరావు ( పాల్వంచ ) , భరత లాలమ్మ, భరత రాంబాబు , భరత లాస్యశ్రీ ( అన్నపురెడ్డిపల్లి ) , జెట్పీ కో ఆప్షన్ సయ్యద్ రసూల్, ఎంపీపీ లు జల్లేపల్లి శ్రీరామ్మూర్తి( అశ్వారావుపేట ) , మేడి సరస్వతి ( పాల్వంచ), మట్ల నాగమణి( ములకలపల్లి, భూక్యా సోన ( లక్ష్మీదేవిపల్లి ) , భూక్యా బాలాజీ , పాయం లలిత , సున్నం ప్రసాద్ ( అన్నపురెడ్డిపల్లి) , సోయం ప్రసాద్ ( దమ్మపేట) , కొత్తగూడెం కు చెందిన పాటిబండ్ల వీరవర ప్రసాద్ విజ్ఞాన యాత్రలో ఉన్నారు.



## మంచినీటి సమస్య

# పరిష్కరించండి

- **ఎమ్మెల్యే కందాళకు మహిళ వినతి**
- **తిరుమలాయపాలెం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్ఓ ప్లాంట్ మరమ్మత్తులకు ఆర్థిక సాయం**
- **పేరెంట్స్ కమిటీ చైర్మన్ పప్పుల వేణుగోపాల్**

**పాలేరు, జులై 13, కెరటం న్యూస్**

తిరుమలాయపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య వల్ల అనారోగ్య పాలవుతున్న విద్యార్థుల భవిష్యత్తు కోసం పేరెంట్స్ కమిటీ చైర్మన్ పప్పుల.వేణుగోపాల్ మరియు కమిటీ సభ్యులు అందరూ కలిసి పాలేరు శాసన సభ్యులు కందాల ఉపేందర్ రెడ్డిని కలవడం జరిగింది. ఈ విషయం పై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్,ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో ఫోన్ లో మాట్లాడారు..సమస్య పరిష్కారం కాకపోవటంతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని వెంటనే 50.000/ రూపాయలతో ఆర్. ఓ.ప్లాంటు రిపేరు కొరకై ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజక వర్గ పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని పేరెంట్స్ కమిటీ సభ్యులు అలాగే ఉపాధ్యాయులు ప్రతి విషయంలో శ్రద్ధ వహించి పిల్లల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు... ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్,కోశాధికారి మీసాల. నాగేశ్వర రావు,కమిటీ సభ్యులు రమేష్,వీరాస్వామి, దార.సురేష్, జెల్లా.రాణి, మోత్కురి. స్వప్న,పి. విజయ పాల్గొన్నారు. తిరుమలాయపాలెం గురుకుల పాఠశాల తరఫున పేరెంట్స్ కమిటీ అలాగే ఎమ్మెల్యే కందాల చేసిన సహాయానికి పాఠశాల ప్రివిపాల్ అర్జున్, వైస్ ప్రిసిపాల్ బోస్ ఉపాధ్యాయులు వాసుదేవ్,నాగరాజు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేసినారు.

# కార్పొరేట్ ఫీజుల దోపిడీ అరికట్టాలి

- **బానోతు బద్రునాయక్**

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

జిల్లా కేంద్రం, ఖమ్మం నగరం లో విచ్చలవిడిగా వెలసిన కార్పొరేట్ పాఠశాలలు , కార్పొరేట్ కళాశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్ డిమాండ్ చేశారు . గురువారం ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు . జిల్లా యంత్రాంగం దృష్టి సారించి , ఎన్ని పాఠశాలలకు ఎన్ని కళాశాలలకు అనుమతులున్నాయి ? నిర్ణీత ఫీజు కాకుండా అధిక ఫీజుల ను వసూలు చేస్తూ , దోపిడీ పాల్పడుతున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు . ఎలాంటి అనుమతులు లేనటువంటి పాఠశాలలో, కళాశాలలో అదేవిధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల , కళాశాల ల గుర్తింపును రద్దు చేయడంతో పాటు వెంటనే వాటిని మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . ఫీజుల దోపిడి వల్ల దళిత , గిరిజన విద్యార్థులతో పాటు ముస్లిం మైనార్టీ విద్యార్థులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని , వారంతా చదువులకు దూరమై పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు . విద్యా హక్కు చట్ట ప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు తమ విద్యాసంస్థలలో అవకాశం కల్పించాల్సి ఉండగా ఆ నిబంధనను నిర్లక్ష్యంగా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . దీనితో పాటు కేవలం ఒక బ్రాంచ్ కే అనుమతులు తీసుకొని వందల బ్రాంచులను నడుపుతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు . విద్యాశాఖ అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని , లేనిపక్షంలో గిరిజన సంఘాల జేఏసీ , ఐక్యవేదిక ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాలు తలపెడతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఎల్.హెచ్.ఎస్ జిల్లా కార్యదర్శి కోటేష్ నాయక్ , జంపా నాయక్ , గౌరవ సలహాదారుడు కిషన్ నాయక్ , పాలేరు ఇంచార్జ్ నెహ్రూ నాయక్ , జిల్లా నాయకులు వీరన్న నాయక్ , మోహన్ నాయక్ , శ్రీను నాయక్ పాల్గొన్నారు.



## బీఎస్ రావు మృతికి

# ఎంపీ నామ సంతాపం

## ఫోన్‌లో కుటుంబ సభ్యులకు పరామర్శ

**ఖమ్మం, జూలై 13, కెరటం న్యూస్**

శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు (బీఎస్ రావు) ఆకస్మిక మృతి పట్ల బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటన లో సంతాపం ప్రకటించారు. వారి ఆకస్మిక మరణంతో మాటల్లో చెప్పలేనంత బాధ కలిగిందన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో రావు ప్రధాన పాత్ర పోషించారని నామ కొనియాడారు.ఆయన మరణం ఖచ్చితంగా తీరని లోటన్నారు. బీఎస్ రావు కుటుంబంతో ఉన్న అవినాభావ సంబంధాన్ని నామ గుర్తు చేసుకొని, బాధ పడ్డారు. ఈ సందర్భంగా నామ ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆయన కుటుంబసభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.బీఎస్ రావు ఆత్మకు శాంతి కలగాలని , కుటుంబ సభ్యులకు మానసిక ధైర్యాన్ని ప్రసాదించాలని నామ దైవాన్ని ప్రార్థించారు.

**మృతదేహం విజయవాడ తరలింపు:** అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చేరిన ఆయన కొద్ది సేపటి క్రితం మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. హైదరాబాద్ నుంచి ఆయన మృతదేహాన్ని విజయవాడ తాడిగడప లోని ఆయన నివాసానికి తీసుకువస్తున్నారు

